# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

జయశంకర్ **భూపాలపల్లి** **ములుగు**

శుక్రవారం 2 ఆగస్టు 2024


# కోచ్ తూచ్!





- కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీకి కొర్రీలు
- 1982, 2004లో మంజూరైనా.. ఇతర రాష్ట్రాలకు తరలింపు
- చివరకు వ్యాగన్ పరిశ్రమ ఏర్పాటు
- రైల్వే డివిజన్ విషయంలోనూ పేచీలే
- అన్ని అర్హతలున్నా డివిజన్‌కు నోచుకోని కాజీపేట రైల్వే జంక్షన్
- కోచ్ ఫ్యాక్టరీ వస్తే 60వేల మందికి ఉపాధి.. వ్యాగన్‌తో అయితే 2వేల మందికే..
- దక్షిణ మధ్య రైల్వేకు గేట్‌వేగా ఉన్నా అభివృద్ధిపై నిర్లక్ష్యం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ, రైల్వే డివిజన్ ఏర్పాటు కలగానే మారుతున్నాయి. 55ఏళ్లుగా కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై ప్రజలు, ఉద్యోగులు ఆందోళన చేస్తున్నారు. 2014లో ఏపీ విభజన చట్టంలో ఇచ్చిన కోచ్ ఫ్యాక్టరీ హామీపై కూడా కేంద్ర ప్రభుత్వం 'తూచ్' అన్నట్టుగానే వ్యవహరిస్తోంది. కోచ్ ఫ్యాక్టరీకి బదులు 2023లో వ్యాగన్ తయారీ పరిశ్రమను ఏర్పాటు చేసి చేతులు దులుపుకొంది. వేలాది మందికి ఉపాధిని కల్పించే కోచ్ ఫ్యాక్టరీని కాదని, వ్యాగన్ పరిశ్రమ ఏర్పాటు చేయటంపై స్థానికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ క్రమంలో 'వ్యాగన్ వద్దు.. కోచ్ ఫ్యాక్టరే ముద్దు' అంటూ ఓరుగల్లువాసులు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు దక్షిణ భారతదేశ రైల్వేకు గేట్‌వేగా ఉన్న కాజీపేట రైల్వే జంక్షన్‌ను డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన పట్టాలెక్కటం లేదు.

**కాజీపేట చేజారిన కోచ్ ఫ్యాక్టరీ..**

కాజీపేట రైల్వే స్టేషన్ ఉత్తర, దక్షిణ భారత దేశానికి వారధిగా నిజాం కాలంలోనే నిర్మించారు. కాశీ నుంచి కన్యా కుమారి, చెన్నై నుంచి కోల్‌కత్తా, హైదరాబాద్ నుంచి ఢిల్లీ వరకు.. ఎక్కడికి వెళ్లాలనుకున్నా కాజీపేట రైల్వే స్టేషన్ మీదుగానే వెళ్లాల్సి ఉంటుంది. దక్షిణ మధ్య రైల్వేలో అత్యధిక ఆదాయం వచ్చే ప్రాంతం కావటంతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉపాధి అవకాశాలు తక్కువగా ఉండటంతో 1969లోనే కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు మొదలయ్యాయి. అప్పటి కమ్యూనిస్టు నేతలు బీఆర్ భగవాన్‌దాసు, కాళీదాసు నేతృత్వంలో మొదలైన కోచ్ ఫ్యాక్టరీ ఉద్యమం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. 1978-80లో అన్ని పార్టీలు తమ జెండాలను పక్కన పెట్టి అఖిల పక్షంగా ఏర్పడి కోచ్ ఫ్యాక్టరీ కోసం ఉద్యమాలకు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో హనుమకొండ ఎంపీగా ఉన్న పీవీ.నర్సింహరావు కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ కోసం చొరవ తీసుకుని అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ వద్దకు అఖిల పక్ష నేతలను తీసుకెళ్లారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీపై అఖిల పక్ష నేతల డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకున్న ఇందిరాగాంధీ 1982లో పార్లమెంట్ వేదికగా కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీని మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే 1984లో ఇందిరాగాంధీ హత్యకు గురవడంతో, ఖలిస్థాన్ ఉద్యమాన్ని చల్లార్చడానికి కాజీపేటకు మంజూరైన కోచ్ ఫ్యాక్టరీని పంజాబ్‌లోని కపుర్తాలకు తరలించారు. ఇక 2004లో యుపీఏ ప్రభుత్వంలో ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్ మరోసారి కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అయితే కాజీపేటకు మంజూరైన కోచ్‌ఫ్యాక్టరీ రాజకీయ కారణాలతో యూపీలోని రాయబరేలికి తరలిపోవటంతో రెండోసారి కూడా కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ దక్కకుండా పోయింది. ఆ తరువాత 2010-11 బడ్జెట్‌లో అప్పటి రైల్వే మంత్రి మమత బెనర్జీ ప్రభుత్వ

మిగతా 8వ పేజీలో...

రాష్ట్ర విభజన హామీల్లో భాగంగా కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తామని ప్రకటించిన గత కేంద్ర ప్రభుత్వం 150 ఎకరాల స్థలాన్ని కూడా కేటాయించింది. కానీ 2017లో కేంద్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడ కూడా కోచ్ ఫ్యాక్టరీల అవసరం లేదని స్పష్టం చేసి.. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీని ఇవ్వలేమని చెప్పిందని పరోక్షంగా అంగీకరించిందని అందరూ భావించారు. అయితే 2018 ఏప్రిల్‌లో మహారాష్ట్రలోని లాతూరులో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుతో పాటు రూ.625కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది. దీంతో కేంద్ర ప్రభుత్వం దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద రైల్వే జంక్షన్‌గా ఉన్న కాజీపేటపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాగా, తెలంగాణ నుంచి ఒత్తిడి పెరగటంతో కేంద్ర ప్రభుత్వం 2023 జూలై 8వ తేదీన కాజీపేటలో 160 ఎకరాల్లో రైల్వేవ్యాగన్ తయారీ పరిశ్రమను ఏర్పాటుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్వయంగా భూమి పూజ నిర్వహించారు. 2025లోపు పూర్తయ్యేలా రూ.521కోట్లతో ఈ వ్యాగన్ పరిశ్రమను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ పనులు జరుగుతున్నాయి. అయితే కోచ్ ఫ్యాక్టరీ డిమాండ్ చేస్తే కేంద్ర ప్రభుత్వం వ్యాగన్ పరిశ్రమను ఏర్పాటు చేయటంపై ఓరుగల్లువాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**కోచ్ అడిగితే.. వ్యాగన్ ఇచ్చిన మోదీ..**

## 'రాష్ట్ర విభజన' హామీని విస్మరించిన కేంద్రం

### వ్యాగన్‌నే అప్‌గ్రేడ్ చేసి కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలి

**- దేవులపల్లి రాఘవేందర్, రాష్ట్ర రైల్వే ఉద్యోగుల జేఏసీ చైర్మన్**



కాజీపేటలో ఏర్పాటు చేసిన వ్యాగన్ పరిశ్రమనే అప్‌గ్రేడ్ చేసి కోచ్ ఫ్యాక్టరీగా ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం వచ్చిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో 20ఎకరాల్లో కూడా కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయవచ్చు. ఈ కోచ్‌ఫ్యాక్టరీతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు ఏర్పడతాయి. అలాగే దక్షిణమధ్య రైల్వేకు వచ్చే ఆదాయంలో అధిక ఆదాయం కాజీపేట నుంచే వస్తుంది. రైల్వే డివిజన్ ఏర్పాటుకు కాజీపేటకు అన్ని అర్హతలున్నాయి. కోచ్ ఫ్యాక్టరీ, రైల్వే డివిజన్ సాధించే వరకు ఉద్యోగ జేఏసీ పోరాటం చేస్తుంది.

### బీజేపీ ఎంపీల అసమర్థత వల్లే..

**- నాయిని రాజేందర్‌రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే**



విభజన చట్టాలను నెరవేరుస్తారన్న ఆకాంక్షతోనే ప్రజలు బీజేపీకి ఎనిమిది మంది ఎంపీలను ఇచ్చారు. కానీ ఆ ఎంపీల అసమర్థత మూలంగానే తెలంగాణలో కీలకమైన కాజీపేటకు రైల్వే కోచ్ ఫ్యాక్టరీ రావటం లేదు. ఏపీ, బీహార్‌కు ఇచ్చిన ప్రాధాన్యం కేంద్రం తెలంగాణకు ఇవ్వటం లేదు. కోచ్ ఫ్యాక్టరీతో పాటు రైల్వే డివిజన్ కోసం క్షేత్రస్థాయి నుంచి ఢిల్లీ వరకు కాంగ్రెస్ పోరాడుతుంది. వచ్చే ఎన్నికల్లో రాహుల్‌గాంధీ ప్రధాన మంత్రి కాగానే విభజన చట్టంలోని హామీలను అమలు చేసి తీరుతాం. కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీతో పాటు డివిజన్‌ను తీసుకొస్తాం.



నిర్మాణంలో ఉన్న వ్యాగన్ ఫ్యాక్టరీ

# ఎమ్మార్పీఎస్ సంబరాలు

**సుప్రీంలో వర్గీకరణ తీర్పుపై హర్షం**



ములుగులో బాణసంచా కాలుస్తున్న ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు

ములుగు కలెక్టరేట్, ఆగస్టు 1: వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టులో తీర్పు రావడంపై ఎమ్మార్పీఎస్ శ్రేణుల్లో హర్షం వ్యక్తమైంది. ములుగులో ఆ సంఘం నాయకులు, కార్యకర్తలు గురువారం సంబరాలు చేస్తున్నారు. 163వ జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించి బాణసంచా కాల్చారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి మిఠాయి పంచుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు జన్ను రవి, బొచ్చు భిక్షపతి, ఇనుముల రామ స్వామి, నద్దునూరి రమేష్, చుంచు రవి, బోడ రఘు, కాకి అశోక్‌బాబు, రాములు, పెండెల రామస్వామి, అనిల్, సంపత్, సృజన్, యాకన్న, రమేష్ పాల్గొన్నారు.

# సమానత్వ హక్కులకు భంగం

**ఉత్తర తెలంగాణ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్**



మీడియాతో మాట్లాడుతున్న కిరణ్

కాటారం, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆర్టికల్ 14ప్రకారం సమానత్వ హక్కులకు భంగం కలిగించేలా ఉందని ఉత్తర తెలంగాణ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పీక కిరణ్ అన్నారు. మండల కేంద్రంలో ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అంశాన్ని పదేపదే తెరపైకి తెచ్చి అన్నదమ్ముల్లా ఉన్న మాల, మాదిగల మధ్య అగ్రవర్ణ రాజకీయ పార్టీలు చిచ్చు పెడుతున్నాయని విమర్శించారు. గతంలో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం రాష్ట్రాలకు ఎస్సీ వర్గీకరణ చేయరాదని ఇచ్చిన తీర్పునే అమలు చేయాలన్నారు. దళితులు కలిసి ఉంటే రాజ్యాధికారం వారికే సొంతమవుతుందనే కుట్రలతో అగ్రవర్ణ రాజకీయ పార్టీలు విడదీసే ప్రయత్నాలు చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. ఈ కోర్టు తీర్పుపై ఎవరూ ఉద్రేకాలు, ఉద్వేగాలకు లోనుకావద్దని, సంయమనం పాటించాలని కోరారు. ఈ సమావేశంలో మాల మహానాడు నాయకులు వావిళ్ల రమేష్, బోడ బాపు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలి

**అధికారులతో కలెక్టర్ రాహుల్‌శర్మ**



టెలీకాన్ఫరెన్స్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, ఆగస్టు 1: జిల్లాలో పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని సంబంధిత అధికారులను కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. వైద్య ఆరోగ్య, విద్య, ఆర్‌డబ్ల్యూఎస్, డీఆర్డీవో, నీటిపారుదల శాఖ అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలతో ఆయన గురువారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలోని అన్ని గ్రామాలు, మునిసిపల్ ప్రాంతంలో ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణను పకడ్బందీగా చేపట్టాలన్నారు. దీన్ని పర్యవేక్షించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శి, ఏఎన్ఎం, ఆశా కార్యకర్త, స్వయం సహాయక సంఘం మహిళ, యువజనులతో టీమ్‌ను ఏర్పాటు చేయాలని డీపీవోను ఆదేశించారు. మునిసిపల్ స్థాయిలో వార్డు ప్రత్యేక అధికారి, మెప్మా రిసోర్స్ పర్సన్స్, కౌన్సిలర్లతో ఏర్పాటుచేయాలన్నారు. భూపాలపల్లి పట్టణంలో వర్మీ కంపోస్టు జరగడంలేదని, వారం రోజుల్లో తయారు ప్రక్రియ ప్రారంభం కావాలని మునిసిపల్ కమిషనర్ రాజేశ్వరరావును ఆదేశించారు. కుక్కల వృద్ధి నియంత్రణ శస్త్ర చికిత్సల నిర్వహణకు యానిమల్ బర్త్ కేర్ యూనిట్‌లను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కుక్కలు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో తక్షణమే చర్యలు చేపట్టి శస్త్ర చికిత్సలు ప్రారంభించాలని ఆదేశించారు. అంటువ్యాధుల నియంత్రణలో సురక్షిత మంచినీటి సరఫరా అత్యంత ప్రధానమన్నారు. తాగునీటి వనరులను నెలల్లో మూడు దఫాల క్లోరినేషన్ చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. దోమల నిరోధానికి మురుగునీటి గుంతల్లో ఆయిల్స్ బాల్స్ వేయాలన్నారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకింపజేసి, భూగర్భ జలాలు పెంచడానికి కమ్యూనిటీ ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, అన్ని శాఖల సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని డీఎంహెచ్‌వో మధుసూదన్‌ను ఆదేశించారు.

# స్థానిక సంస్థ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరాలి

**రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తిరెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తిరెడ్డి

చిట్యాల, ఆగస్టు 1: బీజేపీని మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. పార్టీ స్థానిక కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశానికి జిల్లా అధ్యక్షుడు నిశీధర్‌రెడ్డితో కలిసి ఆమె హాజరయ్యారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండాను ఎగురవేయాలన్నారు. కార్యకర్తలు బూత్ స్థాయి నుంచి కష్టపడాలని, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ అవి వారికి అందేలా కృషి చేయాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చని కాంగ్రెస్‌కు ప్రజలే గుణపాఠం చెబుతారని అన్నారు. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. మండల కేంద్రంలోని చింతల కనుకమ్మ ఇటీవల మృతి చెందగా ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు నాగపూరి రాజమొగిలి, లింగంపల్లి ప్రసాదరావు, చెక్క నర్సయ్య, జగ్గయ్య, అనిల్, కుమారస్వామి, వెంకన్న, మైదం శ్రీకాంత్, రాయిని శ్రీనివాస్, చింతల రాజేందర్, సుదగాని శ్రీను, కత్తుల ఐలయ్య, సంపత్, అజయ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ విద్యార్థిని అనుమానాస్పద మృతి

వివరాలు 8లో..

# వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్

**ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి**



వెంకటాపూర్‌లో రైతులకు కెపాసిటర్లు పంపిణీ చేస్తున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

వెంకటాపూర్(రామప్ప), ఆగస్టు 1: వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యమని తెలంగాణ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అన్నారు. మండలంలో ఆయన గురువారం పర్యటించారు. మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ శివారులో రైతుల కోసం ఏర్పాటుచేసిన డీటీఆర్‌ను ప్రారంభించి పొలంబాట కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యుత్ భద్రత సూత్రాలు, విద్యుత్ పొదుపు తదితర అంశాలపై అవగాహన కల్పించి రైతును రాజును చేయడం కోసం విద్యుత్‌శాఖ ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. ఇందులో భాగంగా ఒరిగిన స్తంభాలను సరిచేయడం, విరిగిన, ప్రమాదకరంగా ఉన్న స్తంభాలను మార్చడం, కిందికి వేలాడుతున్న వైర్లను సరిచేయడం తదితర పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. రైతులకు ఏ చిన్న సమస్య తలెత్తినా స్థానిక విద్యుత్‌శాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. రైతులు మోటార్లకు కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. రైతులు పొలాల్లో ఉన్నప్పుడు విద్యుత్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని, ప్రమాదాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం రైతులకు కెపాసిటర్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో సీజీఎం కిషన్, ఎస్ఈ మల్సూర్ నాయక్, అధికారులు సదానందం, స్వామిరెడ్డి, సందీప్‌పాటిల్, సురేష్, వేణుగోపాల్, సాంబరాజు, వెంకటస్వామి, లైన్‌మెన్ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**లోఓల్టేజీ సమస్యకు పరిష్కారం**

ఏటూరునాగారం రూరల్: లోఓల్టేజీ సమస్యతోపాటు విద్యుత్తు సరాఫరాకు అంతరాయం కలగకుండా విద్యుత్తు శాఖ పటిష్ఠ చర్యలు చేపడుతోందని టీఎస్ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా విరివిగా సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. మండలంలో చిన్నబోయినపల్లిలో నూతన సబ్‌స్టేషన్ మంజూరైనప్పటికీ స్థలం లేకపోవడంతో మండలంలోని శివాపురం గ్రామాన్ని ఆయన సందర్శించారు. అక్కడ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తు అందించేందుకు విశేషంగా కృషి చేస్తున్నామన్నారు. రైతులకు విద్యుత్తు సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. అటవీ గ్రామాల్లో తరచూ విద్యుత్తు సరాఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని, దీన్ని అరికట్టేందుకు గ్రామాల్లో కూడా సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సబ్‌స్టేషన్ల నిర్మాణాలకు ప్రజల స్వచ్ఛందంగా సహకరించాలని కోరారు. ఆయన వెంట సీజీఎం కిషన్, ఎస్ఈ మల్సూర్, డీఈ నాగేశ్వరరావు, ఏడీఈ సుధాకర్, ఏఈ అశోక్, లైన్ ఇన్‌స్పెక్టర్ కొండా సమ్మయ్య తదితరులు ఉన్నారు.

# చిన్న కాళేశ్వరం పనుల అడ్డగింత

**పరిహారం కోసం భూనిర్వాసితల నిరసన**




స్టేజ్-2 పంప్‌హౌస్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

కాటారం, ఆగస్టు 1: మండ లకేంద్రం శివారులో చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు పనులను కొందరు భూములు కోల్పోయిన రైతులు గురువారం అడ్డగించారు. గారెపల్లి నూతన చెరువు కట్టపై ఎక్స్‌కావేటర్‌తో బుష్ క్లియరెన్స్ పనులు చేస్తుండగా నిరసనకు దిగారు. తమకు పరిహారం ఇచ్చే వరకు పనులు చేయొద్దని అభ్యంతరం తెలిపారు. కొత్త చెరువు కోసం 10ఏళ్ల క్రితం భూములను తీసుకోగా కొందరికి నేటికీ పరిహారం దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దుర్గం రాజబాబు, పల్నాటి బలరాం, ఉప్పు సంతోష్, సురేష్, రాంచంద్రం, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# రానున్నవి మంచిరోజులే..

- గనుల్లో పుంజుకోనున్న బొగ్గు ఉత్పత్తి
- సింగరేణి జీఎం సయ్యద్ హబీబ్ హుస్సేన్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జీఎం హబీబ్

కాకతీయఖని, ఆగస్టు 1: సింగరేణి భూపాలపల్లి ఏరియాలోని అండర్ గ్రౌండ్ గనుల్లో బొగ్గు ఉత్పత్తి పుంజుకుంటుందని జనరల్ మేనేజర్ సయ్యద్ హబీబ్ హుస్సేన్ ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో ఏరియాకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. స్థానిక జీఎం కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు బొగ్గు ఉత్పత్తిని అనుకున్న స్థాయిలో సాధించుకోలేకపోయామన్నారు. నూతన ఎస్‌డీఎల్ యంత్రాలు వచ్చాయని, వాటి ద్వారా మెరుగ్గా ఉత్పత్తిని చేపడతామని అన్నారు. రానున్న రోజుల్లో అండర్‌గ్రౌండ్ల ద్వారా అత్యధిక బొగ్గు ఉత్పత్తిని సాధించి ఏరియాను అగ్రభాగాన నిలబెడతామని ధీమా వ్యక్తం చేశారు. ఓసీ-3కి మరో కాంట్రాక్టర్‌ను తీసుకుని ఉత్పత్తిని పెంచుతామన్నారు. కేటీకే-5,6వ గనుల్లో 2సీమ్ నడవడంలేదని, దీంతో డైరెక్టర్ (ఆపరేషన్స్) ఆ సీమ్‌లను నడిపించాలని సూచించారని తెలిపారు. కేటీకే-6వ గని టైం పిరేడ్ ఇంకా రెండేళ్లు మాత్రమే ఉందన్నారు. గనిలోని రెండో సీమ్‌ను ప్రారంభిస్తే దాని కాల పరిమితి పేరిగే అవకాశముందని, దీంతో అండర్ గ్రౌండ్ గనులకు మంచి రోజులు రాబోతున్నాయని అన్నారు. ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్-3లో బొగ్గు ఉత్పత్తి అనుకున్న స్థాయిలో రాకపోవడానికి భూసేకరణ సమస్యలు ఉన్నాయన్నారు. వాటిని త్వరలోనే పరిష్కరించేలా చర్యలు చేపడతామన్నారు. ఇప్పటికే భూములు తీసుకున్న వారికి డబ్బులు చెల్లించామన్నారు. వాటికి సంబంధించిన భూములు కలెక్టర్ తమకు అప్పగించారన్నారు. వాటికి డబ్బులు ముట్టలేదని కొందరు గొడవలు పెడుతున్నారని, అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఓసీ బ్లాస్టింగ్ వల్ల ఇబ్బందులు ఎదురైతే అలాంటి వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఓసీ-3 వద్ద వారం, పది రోజుల్లో కొత్త క్రషర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రస్తుతం ఏరియా రూ.554 కోట్ల నష్టాల్లో పయనిస్తోందని ఫైనాన్స్ అధికారులు తెలిపారు. ఆగస్టు నెలలో ఏరియాకు 2,61,700 టన్నుల బొగ్గు ఉత్పత్తిని నిర్దేశించినట్లు ఐఈడీ అధికారులు తెలిపారు.

**ఆరోపణలన్నీ అవాస్తవం**

తనపై కొందరు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, వ్యక్తిగత పనుల నిమిత్తం తానెవరిని వాడుకోవడం లేదని జీఎం హబీబ్ స్పష్టం చేశారు. డిప్యుటేషన్లలో అవినీతి జరిగిందని పలువురు ఆరోపిస్తున్నారన్నారు. గతంలో 250 మంది ఉద్యోగులు డిప్యూటేషన్‌లో పనిచేసేవారని, ప్రస్తుతం 103 మందికి తగ్గించామని తెలిపారు. డిప్యూటేషన్ అవసరముంటే సీనియారిటీతోపాటు ఏమైనా వ్యాధులతో బాధపడే ఉద్యోగులకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఏరియాలో

మిగతా 8వ పేజీలో...

## ఐదుగురు సీఐలు, ఏడుగురు ఎస్ఐల బదిలీ

వరంగల్ క్రైం, ఆగస్టు 1 : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఐదుగురు సీఐలు, ఏడుగురు ఎస్ఐలను వివిధ పోలీస్ స్టేషన్‌లకు బదిలీ చేస్తూ గురువారం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు.

**బదిలీ అయిన సీఐలు**

ఎ.శ్రీనివాస్‌రెడ్డి వీఆర్ నుంచి రఘునాథ్‌పల్లి, ఇ.శ్రీనివాస్ రఘునాథ్‌పల్లి నుంచి కమిషనరేట్, ఎ.ప్రవీణ్‌కుమార్ ఎల్కతుర్తి నుంచి ధర్మసాగర్, ఎ.మహేందర్ ధర్మసాగర్ నుంచి సీసీఎస్ వరంగల్, జి.వేణు మల్టీజోన్ నుంచి స్టేషన్‌ఘన్‌పూర్.

**ఎస్ఐలు వీరే..**

బండి శ్రావణ్‌కుమార్ కొడకండ్ల నుంచి లింగాలఘనపూర్, సీహెచ్.రాజు లింగాలఘనపూర్ నుంచి ఇంతెజార్‌గంజ్, బానోత్ రాంచరణ్ కేయూసీ నుంచి జాఫర్‌గడ్, ఎ.సురేష్ వీఆర్ నుంచి వేలేర్, డి.హరిత వేలేర్ నుంచి సుబేదారి, ఎస్.నవీన్‌కుమార్ వీఆర్ నుంచి చిల్పూర్, ఎం.రాజేందర్ చిల్పూర్ నుంచి కేయూసీకి బదిలీ అయ్యారు.

## రేపు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 1 : జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం హనుమకొండలోని జేఎన్ క్రీడా మైదానంలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి ఒక ప్రకటనలో తెలిపారు.

## డెంగీకి నిండు గర్భిణి బలి

### గర్భస్థ కవల శిశువులు సహా కన్నుమూత

శాయంపేట, ఆగస్టు 1: మరో వారం పది రోజుల్లో పురుడు పోసుకుని పండంటి ఇద్దరు కవల ఆడపిల్లలకు జన్మనివ్వాల్సిన ఆ తల్లిని డెంగీ జ్వరం బలితీసుకుంది. గర్భంలో ఉన్న పిల్లలు సహా తల్లి మృతి చెందిన విషాదకరమైన ఘటన హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలో జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గట్లకానిపర్తి గ్రామానికి చెందిన బొమ్మకంటి శ్రీకాంత్ ప్రింటర్స్ సర్వీస్ చేస్తూ జీవిస్తున్నాడు. రెండేళ్ల క్రితం పరకాల మండలం మల్లక్కపేట గ్రామానికి చెందిన దొమ్మాటి లక్ష్మి-భిక్షపతి దంపతుల మొదటి కుమార్తె అయిన ప్రియాంకతో శ్రీకాంత్ వివాహం జరిగింది. కొద్దికాలంలోనే ప్రియాంక అనారోగ్యంతో మృతి చెందింది. అనంతరం భిక్షపతి కూడా అనారోగ్యంతో మృతి చెందాడు. భిక్షపతి రెండో కూతురు అయిన శిరీష(29)ను కుటుంబసభ్యులు శ్రీకాంత్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. ఈ నేపథ్యంలో నిండు గర్భిణి అయిన శిరీష మూడు రోజుల క్రితం డెంగీ జ్వరం బారిన పడగా ఆమెను హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. రక్తకణాలు పూర్తిగా పడిపోవడం, గురువారం ఆమె పరిస్థితి తీవ్ర విషమంగా మారడంతో కనీసం గర్భంలో ఉన్న కవల శిశువులనైనా బతికించాలని డాక్టర్లు ప్రయత్నం చేశారు. కానీ వారి ప్రయత్నం ఫలించలేదు. గర్భస్థ శిశువులు సహా శిరీష మృతి చెందింది. కుటుంబంలో వరుస విషాద సంఘటనలు జరగడంతో వారి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తీవ్ర విషాదంలో మునిగారు.

## బీసీల అభివృద్ధికి రూ. 20 వేల కోట్ల కేటాయించాలి

కాజీపేట, ఆగస్టు 1: బీసీల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ. 20 వేల కోట్లు కేటాయించాలని, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ బీసీ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ కోల జనార్దన్ డిమాండ్ చేశారు. కాజీపేట మీడియా పాయింట్‌లో గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. బీసీ సమస్యల పరిష్కారానికి ఆగస్టు 4న హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ మీడియా సమావేశంలో బీసీ సంఘాల నాయకులు సాధినేని సుధాకర్, మాచర్ల శరత్ కుమార్, గొల్లపల్లి వీరస్వామి, తాడిశెట్టి క్రాంతికుమార్, దువ్వ కనుకరాజ్ పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కాజీపేట, ఆగస్టు 1 : రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన వ్యక్తి చికిత్సపొందుతూ మృతి చెందాడు..కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై. సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కాజీపేట ప్రశాంత్‌నగర్ కు చెందిన ఎస్‌డీ అలీ (40), ఈ నెల 25న బైక్‌పై నిట్ నుంచి తన ఇంటికి వెళ్తుండగా గుర్తు తెలియని ఆటో ఢీకొంది. ఈ ఘటనలో ఎస్‌డీ అలీకి తీవ్రగాయాలుకాగా చికిత్స నిమిత్తం కుటుంబీకులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ గురువారం మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు.

## ఆగస్టు, సెప్టెంబరులోనూ జోరు వానలు!

▸ భారత వాతావరణ శాఖ అంచనా

విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల సీజన్‌లో తొలి అర్థభాగం మంచి వర్షాలు కురిశాయి. అదేజోరు ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కొనసాగనుంది. రెండు నెలల్లో దేశంలోని అనేక ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షపాతం (దీర్ఘకాలిక సగటులో 106 శాతం) నమోదవుతుంది. అయితే ఈశాన్య రాష్ట్రాలు, తూర్పు భారతంలో కొన్ని ప్రాంతాలు, సౌరాష్ట్ర, లద్దాక్, మధ్య, దక్షిణ భారతంలో కొన్ని ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే తక్కువ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఆగస్టు నెలలో ఈశాన్య రాష్ట్రాలు, వాయవ్య, మధ్య, తూర్పు, దక్షిణాదిలో పలు భాగాలు, కశ్మీర్, లద్దాక్ వంటి ప్రాంతాలు తప్ప దేశంలో మిగిలిన ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుంది. ఈ మేరకు ఆగస్టు, సెప్టెంబరు నెలలకు సంబంధించి ముందస్తు అంచనా నివేదికను వాతావరణ శాఖ గురువారం విడుదల చేసింది. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో దేశంలో 422.8 మి.మీ వర్షపాతం (1971 నుంచి 2020 వరకు నమోదైన వర్షపాతం సగటులో 106 శాతం) నమోదవుతుందని తాజా బులెటిన్‌లో పేర్కొంది. ఆగస్టులో దేశంలో 254.9 మి.మీ. (1971 నుంచి 2020 వరకు నమోదైన వర్షపాతం సగటులో 94 నుంచి 106 శాతం వరకు) నమోదు కానుంది. ఆగస్టులో దక్షిణాది రాష్ట్రాల్లో తప్ప దేశంలోని అనేక ప్రాంతాల్లో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని తెలిపింది. కాగా, ఆగస్టులో దక్షిణ కోస్తా, సీమల్లో ఎక్కువ, ఉత్తర కోస్తాలో తక్కువ వర్షాలు ఆగస్టు నెలలో దక్షిణ కోస్తా, రాయలసీమల్లో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షాలు కురవనున్నాయి. ఉత్తర కోస్తాలోని ఎక్కువ ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే తక్కువ వర్షాలు కురుస్తాయి. ఉత్తర తెలంగాణ, ఉత్తర కోస్తాలతోపాటు, దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లో సాధారణం కంటే తక్కువ వర్షాలు కురవనున్నాయని వాతావరణ శాఖ అంచనా వేసింది.

# ఇదీ జాతీయ విపత్తే

**మా నాన్నను కోల్పోయినప్పటి పరిస్థితి గుర్తుకొచ్చింది: రాహుల్‌గాంధీ**

▸ సోదరి ప్రియాంకతో కలిసి.. ముండక్కై, చురాల్‌మలలో పర్యటన

▸ జాతీయ విపత్తుగా ప్రకటించాలి: పినరయి

▸ 289కి పెరిగిన మరణాలు



పునరావాస శిబిరంలో బాధితులను ఓదారుస్తున్న రాహుల్, ప్రియాంక

వయనాడ్, ఆగస్టు 1: "వయనాడ్‌లో తీవ్ర విషాదం నెలకొంది. ఆ దృశ్యాలు హృదయాన్ని తీవ్రంగా గాయపరుస్తున్నాయి. నాకు ఏం చెప్పాలో తెలియడం లేదు. మా నాన్న చనిపోయినప్పుడు ఎలా ఉండేదో.. ఇప్పుడు అలాంటి బాధనే ఎదుర్కొంటున్నాను. నా దృష్టిలో ఇది జాతీయ విపత్తే" అని లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ ఉద్వేగంతో అన్నారు. గురువారం ఆయన తన సోదరి ప్రియాంక గాంధీతో కలిసి వయనాడ్‌లో కొండచరియల బాధిత ప్రాంతాలు-- ముండక్కై, చురాల్‌మల, అట్టమల, మెప్పాడిలో పర్యటించారు. ఈ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాల్లో, ఆస్పత్రుల్లో బాధితులతో మాట్లాడారు. "దేశం మీ వెన్నంటే ఉంది.." అంటూ వారికి ధైర్యం చెప్పారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఇది బాధాకరమైన పరిస్థితి అని.. పినరయి ప్రభుత్వం బాధితులకు అన్ని విధాలా సాయం చేయడానికి కట్టుబడి ఉందని చెప్పారు. ముందే హెచ్చరించామంటూ లోక్‌సభలో హోంమంత్రి అమిత్‌షా చేసిన ప్రకటన గురించి విలేకరులు ప్రస్తావించగా.. "ఇది రాజకీయ ఘర్షణకు సమయం కాదు. అన్ని వ్యవస్థలు కలిసికట్టుగా పనిచేయాల్సిన తరుణమిది" అని వ్యాఖ్యానించారు. కరోనా కష్టకాలంలో తాను, ప్రియాంక వయనాడ్ ప్రజలకు అండగా ఉన్న విషయాన్ని గుర్తుచేస్తూ.. ఇప్పుడు కూడా సహాయక చర్యలు, పునరావాస కార్యక్రమాలను నిశితంగా పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. అనంతరం ఇదే విషయాన్ని తన ఎక్స్, ఫేస్‌బుక్ ఖాతాల్లో పోస్ట్ చేశారు. మరోవైపు కేరళ సీఎం పినరయి విజయన్ కూడా వయనాడ్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 280కి పైగా పౌరులు చనిపోయారని, కేంద్రం జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. జాతీయ విపత్తుగా ప్రకటించడానికి అభ్యంతరం ఏంటని ప్రశ్నించారు. సహాయక చర్యల్లో పాల్గొంటున్న సైన్యం, రెస్క్యూ వర్కర్లు, స్థానికులను ఆయన అభినందించారు. ఆర్మీ జాగిలాలు మృతదేహాలను గుర్తిస్తున్నాయని, నదిలో కొట్టుకుపోయిన శరీర భాగాలను వెలికితీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. కాగా.. కొండచరియలు విరిగిపడ్డ ఘటనల్లో మృతుల సంఖ్య 289కి పెరిగినట్లు అధికారులు వివరించారు. గల్లంతైన వారి ఆచూకీ తెలుసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు.

### డార్క్ టూరిజం వద్దు

వయనాడ్‌లో డార్క్ టూరిజానికి రావొద్దంటూ కేరళ పోలీసులు సామాజిక మాధ్యమాల్లో విజ్ఞప్తి చేశారు. దీంతో.. 'డార్క్ టూరిజం' అనే పదం వైరల్‌గా మారింది. 'చెర్నోబిల్ అండ్ ది డార్క్ టూరిస్ట్' టీవీ షోతో ఈ పదం బాగా పాపులర్ అయింది. మరణం, విషాదం, హింస చోటుచేసుకుని, అసాధారణ పరిస్థితులు ఉండే ప్రదేశాలను సందర్శించడాన్ని డార్క్ టూరిజం అంటారు. ఉదాహరణకు ఉక్రెయిన్‌లోని చెర్నోబిల్ (అణు విద్యుత్తు కేంద్రం) ఘటన, కాంబోడియాలో కిల్లింగ్ ఫీల్డ్స్, పోలెండ్‌లోని అశ్విట్జ్ క్యాంప్ వంటివి డార్క్ టూరిజం కిందకు వస్తాయి. ఇప్పుడు వయనాడ్‌కు డార్క్ టూరిస్టులు వస్తే.. సహాయక చర్యలకు ఆటంకాలేర్పడతాయని కేరళ పోలీసులు ఆందోళన వ్యక్తం చేశారు.

## హమాస్‌కు భారీ దెబ్బ!

▸ ఇజ్రాయెల్‌పై దాడుల వ్యూహకర్త మిలిటరీ చీఫ్ డెయిఫ్ హతం!

▸ జూలై 13న గాజాలో అంతం చేశాం

▸ ప్రకటించిన ఇజ్రాయెల్ సైన్యం

▸ ఆ ప్రకటనను ఖండించిన హమాస్

జెరూసలెం, ఆగస్టు 1: హమాస్‌కు మరో భారీ దెబ్బ తగిలింది. ఇరాన్ రక్షణలో ఉన్న హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియా హత్యకు గురైన మరునాడే హమాస్ మిలిటరీ చీఫ్, ఇజ్రాయెల్‌పై దాడుల వ్యూహకర్త మహమ్మద్ డెయిఫ్ హతమయ్యాడు. డెయిఫ్‌ను తమ సైన్యం అంతం చేసినట్టు ఇజ్రాయెల్ గురువారం అధికారికంగా ప్రకటించింది. తన ప్రకటనలో ఆపరేషన్ వివరాలను వెల్లడించింది. "మా సైన్యం (ఐడీఎఫ్) గత నెల 13న గాజాలోని ఖాన్ యూనిస్ ప్రాంతంపై జెట్లతో దాడి చేసింది. అక్కడ హమాస్‌కు చెందిన డిప్యూటీ కమాండరు నివాసంలో డెయిఫ్ ఉన్నట్టు గుర్తించాం. అక్కడ జెట్లతో బాంబులు ప్రయోగించాం. ఈ దాడిలో డెయిఫ్ హతమయ్యాడు" అని ఆ ప్రకటనలో తెలిపింది. గత ఏడాది అక్టోబరు ఏడున ఇజ్రాయెల్ భూభాగంపై జరిగిన దాడుల ఆలోచన, ప్రణాళిక, అమలు అంతా డెయిఫ్ నేతృత్వంలో జరిగిందని ఇజ్రాయెల్ ఆరోపిస్తోంది. ఈ దాడుల్లో 1197 మంది ఇజ్రాయెల్ పౌరులు చనిపోయారు. కాగా, డెయిఫ్ మరణవార్తపై హమాస్ స్పందించింది. ఖాన్ యూనిస్‌పై జూలైలో ఇజ్రాయెల్ దాడులు చేసిన మాట నిజమేనని, అందులో 90మంది చనిపోయారని, మృతుల్లో డెయిఫ్ లేరని గాజాలోని హమాస్‌కు చెందిన ఆరోగ్య వర్గాలు ధ్రువీకరించాయి.

## కర్ణాటక సీఎంకు గవర్నర్ నోటీసుపై మంత్రివర్గం అభ్యంతరం

▸ వెనక్కి తీసుకోవాలని ఏకగ్రీవ తీర్మానం

బెంగళూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార(ముడా) ఇంటి స్థలాల కేటాయింపు అవినీతి వ్యవహారంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ నోటీసులు జారీ చేయడంపై మంత్రి వర్గం తీవ్ర అభ్యంతరం తెలిపింది. విధానసౌధలో గురువారం సీఎం సిద్దరామయ్య లేకుండా డీసీఎం డీకే శివకుమార్ అధ్యక్షతన క్యాబినెట్ భేటీ జరిగింది. ముడా అవినీతికి సంబంధించి గవర్నర్ జారీ చేసిన నోటీసులు వాపసు తీసుకోవాలని క్యాబినెట్‌లో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ విషయాన్ని సహకార శాఖ మంత్రి రాజణ్ణ మీడియాకు తెలిపారు. సీఎం సిద్దరామయ్యకు రాజభవన్ నుంచి వచ్చి న షోకాజ్ నోటీసు గురించి చర్చించామని, న్యాయపోరాటం చేయాలని తీర్మానించామని చెప్పారు. గవర్నర్ జారీ చేసిన నోటీసును వాపసు తీసుకోవాలని క్యాబినెట్‌లో తీర్మానించామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రికి గవర్నర్ నోటీసు జారీ చేయడం రాజకీయ ప్రేరేపితమని ఆరోపించారు. నోటీసులు తిరస్కరించాలని నిర్ణయం తీసుకున్నామని ఆయన తెలిపారు.

# ఉత్తరాది అతలాకుతలం

(మొదటి పేజీ తరువాయి)



వర్షాలకు హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలీలో ధ్వంసమైన రోడ్డు



కోల్పోయారు. కులు జిల్లాలో ఏడుగురు కొట్టుకుపోయారు. మలానా జల విద్యుత్ కేంద్రంలో పలువురు చిక్కుకుపోయారు. బియాస్ నది ఉధృతి, కొండచరియలు విరిగిపడడంతో కీలకమైన మనాలీ-చండీగఢ్ జాతీయ రహదారి పలుచోట్ల తీవ్రంగా దెబ్బతిన్నది. హిమాచల్ సీఎం సుఖుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఫోన్ చేసి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కాగా, రాష్ట్రంలోని పాలంపూర్, చౌరీలో 21 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ధర్మశాల (18 సెం.మీ.) సహా పలు ప్రాంతాల్లో 10కి పైగా సెం.మీ. వర్షం పడింది. కంగ్రా, కులు, మండిలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలతో రాత్రికి రాత్రే వరద పోటెత్తింది. పలు నదులు ప్రమాదకర స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. డెహ్రాడూన్‌లో పరిస్థితి తీవ్రంగా ఉంది. రాష్ట్రంలో మొత్తం 12 మంది మృతిచెందారు. హరిద్వార్‌లోనే ఆరుగురు చనిపోయారు. ఇక్కడ 21 సెం.మీ. వర్షపాతం నమోదైంది. చాలాచోట్ల 10 సెం.మీ. పైన వాన పడింది. కేదార్‌నాథ్ మార్గంలో 1,500 మంది యాత్రికులు చిక్కుకుపోయారు. వీరిలో 425 మందిని హెలికాప్టర్ ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఉత్తరాఖండ్, హిమాచల్‌లో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సైన్యం, స్థానిక పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. దేశ రాజధాని ఢిల్లీలోని చాలా ప్రాంతాలు ఇంకా నీటిలోనే ఉన్నాయి. ఆరుచోట్ల ఒక్క రోజులోనే 10 సెం.మీ. పైగా వర్షపాతం నమోదైంది. వివిధ ఘటనల్లో ఐదుగురు చనిపోయినట్లు అధికారులు తెలిపారు. 12 ఏళ్ల బాలుడు, 26 ఏళ్ల యువకుడు విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు రాజస్థాన్ రాజధాని జైపూర్‌ను వర్షాలు ముంచెత్తాయి. ఓ ఇంట్లోకి వరద చేరడంతో ఆరేళ్ల బాలిక సహా ముగ్గురు మృతిచెందారు. హిమాచల్, పంజాబ్, హరియాణా, ఢిల్లీ, ఉత్తరాఖండ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, గోవాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

# పార్లమెంట్ పైకప్పు లీకేజీ

▸ బీజేపీ ప్రభుత్వంపై ప్రతిపక్షాల మండిపాటు

▸ లీకేజీ స్వల్పమే.. పరిష్కరించాం: కేంద్రం



న్యూఢిల్లీ, ఆగస్టు 1: ఢిల్లీలో కురుస్తున్న భారీ వర్షాలకు కొత్త పార్లమెంటు భవనం పైకప్పు లీకవుతోంది. రూ.1,000 కోట్లకు పైగా ఖర్చు చేసి నిర్మించిన ఈ భవనం లాబీలోని గాజు పైకప్పు నుంచి కింద ఉంచిన బకెట్‌లోకి నీరు ధారగా పడుతున్న వీడియోను సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. "కొత్త భవనం కంటే పాత భవనం చాలా మెరుగ్గా ఉంది. వర్షాకాల సమావేశాలను పాతదానిలో ఎందుకు నిర్వహించకూడదు. కనీసం కొత్తదానిలో నీరు కారడం ఆగిపోయే వరకైనా..' అంటూ వ్యంగాస్త్రాలు సంధించారు. ఈ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రతి కొత్త భవనం పైకప్పు నుంచి నీరు లీకవడం.. బాగా ఆలోచించి రూపొందించిన డిజైన్‌లో భాగమా అని ప్రజలు అడుగుతున్నారని ఆయన బీజేపీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఈ వీడియోపై కాంగ్రెస్ ఎంపీ మాణిక్యం ఠాగూర్ స్పందించారు. "బయట పేపర్ లీక్.. లోపల వాటర్ లీక్.. నిర్మించిన ఏడాది పూర్తి కాకుండానే పార్లమెంట్ లాబీలో నీరు లీక్ కావడం కొత్త భవనంలో అత్యవసర పునరుద్ధరణ సమస్యలను ఎత్తి చూపుతోంది" అని ఎద్దేవా చేశారు. ఈ అంశంపై చర్చించడానికి ప్రస్తుత లోక్‌సభ సమావేశాల్లో ఆయన వాయిదా తీర్మానం ప్రవేశపెట్టారు. 'రూ.1,200 కోట్ల వ్యయంతో నిర్మించిన పార్లమెంట్ ఇప్పుడు రూ.120 బకెట్‌పై ఆధారపడి ఉంది' అని ఆమ్ ఆద్మీ పార్టీ ఎద్దేవా చేసింది. సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో భాగంగా కొత్త పార్లమెంట్ భవనాన్ని 2023 మే 28న ప్రధాని మోదీ ప్రారంభించారు. కాగా, పైకప్పు గ్లాస్ డోమ్‌లకు ఏర్పాటుచేసిన పట్టీలు వదులుగా ఉండటంతో కొత్త పార్లమెంటు భవనం మకర ద్వారం వద్ద స్వల్పంగా నీరు లీకైందని లోక్‌సభ సెక్రటేరియట్ తెలిపింది. సకాలంలో సమస్యను గుర్తించి, వెంటనే మరమ్మతులు చేపట్టామని, అంతటితో నీరు కారడం ఆగిపోయిందని కేంద్ర ప్రభుత్వం వివరణ ఇచ్చింది.

## రేపు ఎస్సార్ యూనివర్సిటీలో ద్వితీయ స్నాతకోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సార్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ అర్చనారెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 1: హసన్‌పర్తి మండలం అనంతసాగర్‌లోని ఎస్సార్ విశ్వవిద్యాలయంలో శనివారం ద్వితీయ స్నాతకోత్సవ కార్యక్రమం అట్టహాసంగా నిర్వహిస్తున్నామని ఎస్సార్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్. అర్చనారెడ్డి తెలిపారు. గురువారం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె స్నాతకోత్సవ వివరాలను వెల్లడించారు. స్నాతకోత్సవ కార్యక్రమానికి సయంట్ ఫౌండర్ ఛైర్మన్ డాక్టర్ బీవీఆర్. మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారన్నారు. గత 45 ఏళ్లుగా విద్యారంగంలో ఎస్సార్ విద్యాసంస్థలు ముందున్నాయని, 2022లో ప్రైవేటు యూనివర్సిటీగా ఎస్సార్ ఆమోదించబడిందని గుర్తు చేశారు. 2002లో ప్రాంభంమైన ఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల అంచెలంచెలుగా ఎదుగుతూ నాక్, ఎన్‌బీఏ, డబ్లుజీసీ అక్రిడిటేషన్లు సాధించిందన్నారు. ఇంజనీరింగ్ విభాగంలో జాతీయ స్థాయిలో 2023లో 98వ స్థానం సాధించిందన్నారు. నూతన ఆవిష్కరణలతో అటల్ ర్యాంకింగ్స్‌లో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. స్నాతకోత్సవ కార్యక్రమంలో డిగ్రీల ప్రదానంతో పాటు గౌరవ డాక్టరేట్లు, పూర్వ విద్యార్థులకు సత్కారం, కాంక్లేవ్, టాసింగ్ ఆఫ్ క్యాప్స్, అధికారిక ఊరేగింపు తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మహేష్, డాక్టర్ రామ్‌దేశ్‌ముఖ్, డాక్టర్ సుమన్‌కుమార్, డీన్లు, హెడ్స్ తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మగౌరవ పోరాటం ఫలించిన వేళ

▸ ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు

▸ వర్గీకరణ పోరాటానికి, నాయకత్వానికి వేదికైన ఓరుగల్లు



హనుమకొండ సిటీ, ఆగస్టు 1: మూడు దశాబ్దాల మాదిగల ఆత్మగౌరవ రక్షణ పోరాటం ఫలించింది. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు తీర్పు చెప్పడంతో మాదిగ జాతి ఆనందడోలికల్లో మునిగితేలుతోంది. వర్గీకరణే లక్ష్యంగా ఎన్నో పోరాటాలు, ఉద్యమాలకు ఓరుగల్లు నుంచే అంకుర్పారణ జరిగింది. ప్రకాశం జిల్లా ఈదుముడి గ్రామంలో ఎంఆర్‌పీఎస్ కమిటీ నిర్మాణం జరిగినా.. అంతకు ముందు నుంచే ఓరుగల్లులో ఎంఆర్‌పీఎస్ స్థాపనపై ఆలోచనలు, సమావేశాలు, చర్చలు జరిగాయి. ఈ మహోత్తర పోరాటానికి వ్యవస్థ నిర్మాణమే కాదు నాయకత్వం వహించిన నాయకుడు మందకృష్ణ మాదిగ ఓరుగల్లు వాసే. పోరుగల్లు పోరాట వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న ఆయన లక్ష్య సాధన వైపు అడుగులు వేయగా.. ఆయన వెంట మాదిగ జాతి యావత్తు నడిచింది. పోరాట క్రమంలో అభిప్రాయభేదాలు వచ్చినా.. అప్పటి వరకు ఒక్కటిగా ఉన్న మాదిగ సంఘాలు వేరయినా.. అందరి లక్ష్యం 'వర్గీకరణే' అన్నట్టుగా పోరు సాగింది. చివరకు గురువారం సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో దేశ చరిత్రలో ఓ మహా ఘట్టం ఆవిష్కృత మైంది. విద్య, ఉద్యోగాల్లో మాదిగ జాతి అభ్యర్థులకు సముచిత న్యాయం దక్కే అవకాశం వచ్చింది.

### పోరాటంలో ఓరుగల్లుదే కీలక పాత్ర

ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా మూడు దశాబ్దాల పాటు సాగిన పోరాటంలో ఓరు గల్లు కీలకపాత్ర పోషించింది. హనుమకొండ హంటర్‌రోడ్డు న్యూశాయంపేటకు చెందిన మందకృష్ణ మాదిగ అడుగు ముందుకేశారు. 1994 జూలై 7న ప్రకాశం జిల్లా ఈదుముడి గ్రామంలో 20మంది యువకులతో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితిని ఏర్పాటు చేసిన అదే రోజున గ్రామ కమిటీని నియమించారు. అనంతరం రాష్ట్ర కన్వీనర్‌గా బాధ్యతలు చేపట్టిన మందకృష్ణ మాదిగ నేతృత్వంలో ఒంగోలు, హైదరబాద్‌లో జరిగిన భారీ బహిరంగ సభలు వర్గీకరణ పోరాటానికి బలమైన పునాదులు వేశాయి. అనంతరం 1998లో జస్టిస్ రాంచంద్రరాజు కమిషన్ ఏర్పటవగా.. వర్గీకరణకు ఆ కమిషన్ సిఫార్సు చేసింది. నాటి ఉమ్మడి రాష్ట్ర సీఎం చంద్ర బాబు వర్గీకరణకు ఓకే చెప్పడంతో 2004 వరకు 22వేల ఉద్యోగాలు మాదిగ సామాజిక అభ్యర్థులకు లభించాయి. కానీ పార్లమెం ట్‌లో బిల్లు ప్రవేశపెట్టకుండా వర్గీకరణ అమలు చేయడమేంటన్న వివాదాలు తలెత్తడంతో వర్గీకరణకు ఆటంకంఏర్పడింది. దీనిపై మళ్లీ ఉద్యమం రగిలింది. వైయస్ ప్రభుత్వ హయంలో 2004లోనే మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఛలో అసెంబ్లీ పోరాటం చేయడంతో నాటి వైయస్ ప్రభుత్వం వర్గీకరణపై తీర్మానం చేసి కేంద్రానికి పంపింది.

2006లో నాటి కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఉషామెహ కమిషన్ వేయగా 2008లో ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించిన కమిషన్ బృందం వర్గీకరణతోనే సామాజిక న్యాయం జరుగుతుందని నివేదిక ఇచ్చింది. ఆ తరువాత తెలంగాణ మలి దశ ఉద్యమం ఆరంభం కావడంతో వర్గీకరణ బిల్లు తెరమరుగైంది. రాష్ట్ర ఆవిర్భావం తరువాత మళ్లీ వర్గీకరణ పోరాటం ఊపందుకుంది. ఈ క్రమంలోనే సుప్రీంకోర్టు వర్గీకరణ అమలు తీర్పును ఇవ్వడంతో మూడు దశాబ్దాల పోరా టానికి విజయంతో ముగింపు వచ్చింది.




### జిల్లాలో జరిగిన ముఖ్య ఘట్టాలు..

2006లో ఎంఆర్‌పీఎస్ నాయకులు ఆందోళనలు చేపట్టారు. ఇందులో భాగం గా కాజీపేటలో అర్ధరాత్రి పుష్‌పుల్ రైలుకు నిప్పంటించారు. ఈ ఘటన దేశ వ్యాప్తంగా వర్గీకరణ ఉద్యమ తీవ్రతను చాటింది. ఇక అదే ఏడాది హైదరాబా ద్‌లో మందకృష్ణ చేపట్టిన ఆమరణ దీక్షలో వరంగల్ జిల్లా నుంచే అత్యధికంగా మేధావులు, యువకులు పాల్గొన్నారు.

## రైతులకు రుణాలు అందించాలి

**ములుగు కలెక్టర్ దివాకర**

గోవిందరావుపేట, ఆగస్టు 1: అర్హులైన ప్రతి రైతుకూ రుణమాఫీ చేసి మళ్లీ రుణం అందించాలని కలెక్టర్ దివాకర అన్నారు. మండలంలోని పస్రా కెనరాబ్యాంకును ఆయన గురువారం సందర్శించారు. రైతు రుణమాఫీ లోన్ల రెన్యువల్ ప్రక్రియపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ బ్యాంకర్లు రుణమాఫీ ప్రక్రియలో కీలకపాత్ర పోషించాలని, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ రైతులకు చేరేలా రెన్యువల్ చేయాలని సూచించారు. రైతులకు సకాలంలో రుణం అందిస్తే విత్తనాలు, పెట్టుబడికి ఉపయోగపడుతుందన్నారు. అనంతరం రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్, ఏఎంవో జితేందర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

### పారిశుధ్య పనులు చేపట్టాలి

మంగపేట: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులను పటిష్ఠంగా చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ దివాకర ఆదేశించారు. మంగపేట రైతు వేదిక భవనంలో అదనపు కలెక్టర్ సి.హెచ్. మహేందర్‌జీతో కలిసి మండల అధికారులు, ఉద్యోగులతో ఆయన సమావేశమయ్యారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు పాటించాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా ప్రజల్లో ప్రచారం చేయాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఫీవర్‌సర్వే చేపట్టాలని, వైద్య శిబిరాలను నిర్వహించాలని అన్నారు. ఇంటింటికి సురక్షిత తాగు నీటిని సరఫరా చేయాలని సూచించారు. అంతకు ముందు కమలాపురంలో బిల్ట్ ఫ్యాక్టరీ పునుద్ధరణపై గ్రామస్థులు, ప్రజాప్రతినిధులతో తహసీల్దార్ కార్యాలయంలో సమావేశమయ్యారు. గోదావరి ఇన్‌టేక్‌వెల్‌ను పరిశీలించారు. ఆయన వెంట ఎస్సీ కార్పొరేషన్ జిల్లా ఈడీ, మండల ప్రత్యేక అధికారి తుల రవి, డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య, తహసీల్దార్ బి. వీరస్వామి, ఎంపీడీవో శ్రీకాంత్, ఫిన్‌క్విస్ట్ ప్రతినిధి ప్రసాద్ నాయర్, పంచాయతీ కార్యదర్శులు, గ్రామాల ప్రత్యేక అధికారులు, వైద్యాధికారులు ఉన్నారు.

## రోడ్డు నియమాలు పాటించాలి

**రవాణా శాఖ జిల్లా అధికారి సమ్ధాని**

కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఆగస్టు 1: రోడ్డు నియమాలు తప్పక పాటించాలని రవాణా శాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి ఎం.డి.సమ్ధాని అన్నారు. జిల్లా కేంద్రంలోని లారీ అసోసియేషన్ ఆవరణలో రవాణాశాఖ ఆధ్వర్యంలో భూపాలపల్లి సీఐ నరేష్‌కుమార్‌తో కలిసి డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహిం చారు. రహదారి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఓవర్ స్పీడ్, ఓవర్ టేక్ చేయడం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటివి మానుకో వాలన్నారు. అనుమతి లేని చోట వాహనాలను పార్కింగ్ చేయొద్దన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాస్, కాకతీయ లారీ అసోసియేషన్ అధ్యక్షుడు మేకల చంద్రయ్యతోపాటు సభ్యులు పాల్గొన్నారు.

## గురుకులంలో వైద్య శిబిరం

కాటారం, ఆగస్టు 1: మండలంలోని మేడిపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి మౌనిక ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది శిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. హ్యాండ్ వాష్, వ్యక్తిగత. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. హెచ్ఎం రవిశంకర్, డాక్టర్ ప్రియాంక, హెచ్ఈవో తిరుపతిరెడ్డి, హెచ్ఏ సమ్మయ్య, హెచ్ఎం రవిశంకర్, ఏఎన్ఎం లక్ష్మి, ఆశా కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## 'వర్గీకరణ'పై హర్షం

కాటారం, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై ఎమ్మార్పీఎస్ శ్రేణుల్లో హర్షం వ్యక్తమైంది. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మంథెన చిరంజీవి, ఇన్‌చార్జి అశోక్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో గురువారం బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు నిర్వహించారు.

● మహదేవపూర్: ఎమ్మార్పీఎస్ నాయకులు మండల కేంద్రంలో సంబరాలు చేసుకున్నారు. మందకృష్ణ మాదిగ నేతృత్వంలో 30 ఏళ్ల తమ సుదీర్ఘ పోరాటం ఫలించే సమయం ఆసన్నమైందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్, ఎమ్మెస్పీ నాయకులు తూటిచెర్ల దుర్గయ్య, అధికార ప్రతినిధి మంథని రవితేజ, సీనియర్ నాయకులు నల్లబుగ్గ ధర్మయ్య, వేమునూరి జక్కయ్య, మోతె సాంబయ్య, బెల్లంపల్లి ప్రవీణ్, లింగాల సాగర్, కొలుగూరి సుమన్, లింగాల ప్రవీణ్, తారాచంద్ తదితరులు పాల్గొన్నారు.

● టేకుమట్ల : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును హర్షిస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు మండల కేంద్రంలో బాణసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. ప్రధాని మోదీ, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి రేణుకుంట్ల సంపత్, నాయకులు రాం రాంచందర్ మాదిగ, సారయ్య, సరోత్తం, అక్కల రాజయ్య, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

● గోవిందరావుపేట: మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. జాతీయ రహదారిపై బాణసంచా కాల్చి మిఠాయి పంచుకున్నారు. మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా సమన్వయకర్త నెమలి నర్సయ్య, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ విజిలెన్స్, మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యుడు జన్ను రవి, మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లెపల్లి రమేష్, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు కాకి అశోక్, దళిత నాయకులు నద్దునూరి రమేష్, బొచ్చు భిక్షపతి, ప్రకాశ్, కరుణాకర్, సిద్దున్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● మంగపేట : ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీం తీర్పును హర్షిస్తూ ఎమ్మార్పీఎస్, తుడుందెబ్బ, ఆదివాసీ జేఏసీ ఆధ్వ ర్యంలో సంబరాలు జరుపుకున్నారు. బాణ సంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు.

● చిట్యాల: సుప్రీం కోర్టు తీర్పునకు అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను ప్రారం భించాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. సుప్రీం కోర్టు తీర్పు పట్ల హర్షం వ్యక్తం చేశారు. వివిధ సంఘాల నాయకులు పుల్ల మల్లయ్య, దొడ్డి కిష్టయ్య, సరిగొమ్ముల రాజేందర్, యుగంధర్, నేరెళ్ల ఓదెలు, గోల్కొం డ సురేష్, బొడ్డు ప్రభాకర్, అనిల్, ఆనందం, మాసు రమేష్, కట్కూరి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.




చిట్యాల, గోవిందరావుపేటలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ శ్రేణుల సంబరాలు

# ఇంటర్ విద్యార్థిని అనుమానాస్పద మృతి

బాలసముద్రం, ఆగస్టు 1 : హనుమకొండ నగరం నక్కలగుట్టలోని వైబ్రంట్ అకాడమీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఇనుముల భవానిరెడ్డి(15) బుధవారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపూర్ గ్రామానికి చెందిన ఇనుముల జనార్దన్‌రెడ్డి, సుమలత దంపతులకు కూతురు భవానిరెడ్డి, కుమారుడు రిషిరెడ్డి ఉన్నారు. జనార్దన్‌రెడ్డి కమలాపూర్‌లో మోటర్ వైండింగ్ పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. భవానిరెడ్డి వైబ్రంట్ అకాడమీలో ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతోంది. బుధవారం రాత్రి 9:30 గంటలకు భవానిరెడ్డి హాస్టల్‌లోని తన గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకోగా.. గమనించిన వెంటనే ఆమెను అక్కడి నుంచి వాహనంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించామని, అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలపడంతో మృతదేహాన్ని వరంగల్‌లోని ఎంజీఎం మార్చురీకి తరలించినట్టు హాస్టల్ వార్డెన్ సంగీత, ఇన్‌చార్జ్ ధరణి తెలిపారు. ఇక భవానిరెడ్డి మృతి విషయంలో తమకు అనుమానాలు ఉన్నాయంటూ కుటుంబసభ్యులు, విద్యార్థిసంఘాల నాయకులు గురువారం ఉదయం వైబ్రంట్ అకాడమీ వద్దకు చేరుకొని ఆందోళనకు దిగారు. కాలేజీ ఎదుట ధర్నా చేసి.. ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వారు ఆందోళన చేయగా.. సుబేదారి సీఐ సత్యనారాయణరెడ్డి పోలీస్ సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని విద్యార్థి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అయిన్పటికీ వారు శాంతించపోవడంతో ఏసీపీ దేవేందర్‌రెడ్డి వచ్చి వారితో మాట్లాడారు. కాలేజీ యాజమాన్యం విద్యార్థిని మృతికి బాధ్యత వహించి బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని చెప్పడంతో గొడవ సద్దుమనిగినట్లు భవానిరెడ్డి బంధువులు, పోలీసులు తెలిపారు. కాగా మృతురాలి తండ్రి జనార్దన్‌రెడ్డి ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేశామని సీఐ సత్యనారాయణరెడ్డి తెలిపారు.

### యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

విద్యార్థి మృతికి కారణమైన కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పలువురు విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. ఉన్నతాధికారులు వెంటనే కళాశాల వద్దకు రావాలని వారు కోరడంతో ఏసీపీ దేవేందర్ రెడ్డి డీఈవోతో ఫోన్‌లో మాట్లాడించారు. కళాశాలకు అనుమతులు లేవని డీఈవో వారికి తెలపడంతో వారు మరింత ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. అనుమతి లేకుండా నడిపిస్తున్న వైబ్రంట్ అకాడమీని తక్షణం మూసేసి చైర్మన్ రాజేందర్‌రెడ్డిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన భవానిరెడ్డి కుటుంబానికి యాజమాన్యమే రూ.50లక్షలు చెల్లించాలని ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా ప్రధానకార్యదర్శి బాషబోయిన సంతోష్ డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో తెలంగాణ విద్యార్థి పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడ రంజిత్, బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాడపాక రాజేందర్, తెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునీల్, లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కో ఆర్డినేటర్ అజ్మీరా వెంకట్ నాయక్, ధర్మ స్టూడెంట్ యూనియన్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి పూరెల్ల విష్ణు పాల్గొన్నారు.

## రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి అన్యాయం

**తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ**

కాకతీయఖని, ఆగస్టు 1: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి అన్యాయం జరిగిందని తెలంగాణ విద్యా పరిరక్షణ స్టీరింగ్ కమిటీ సభ్యులు రమణారెడ్డి, తిరుపతి, సేవానాయక్, ప్రవీణ్ అన్నారు. భూపాలపల్లిలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో సంఘం ఆధ్వర్యంలో గురువారం జరిగిన నిరసన కార్యక్రమంలో వారు మాట్లాడారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు తక్కువ నిధులు కేటాయించడం నిర్లక్ష్య ధరణికి నిదర్శనమన్నారు. ఎన్నికల ముందు మెనిఫెస్టోలో ప్రకటించిన విధంగా 15 నుంచి 20శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రసన్న లక్ష్మి, జోసెఫ్, కోమల, శంకరయ్య, రామకృష్ణ, రాందాన్, కృష్ణ, తిరుపతి, కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

## బొగ్గులవాగు ప్రాజెక్టు నీటి విడుదల

మల్హర్, ఆగష్టు 1 : మండలంలోని ఎడ్లపల్లి అటవీ ప్రాంతంలోని బొగ్గులవాగు ప్రాజెక్టు నీటిని గురువారం రైతులు, అధికారులతో కలిసి తాజా మాజీ ఎంపీపీ చింతలపల్లి మల్హల్‌రావు విడుదల చేశారు. వారం రోజుల క్రితం ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల వల్ల ప్రాజె క్టు నిండినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తు తం ప్రాజెక్టులో పూర్తి స్థాయి నీటిమట్టం ఉందని, రైతులు సాగునీరు పొదుపుగా విని యోగించుకోవాలని అన్నారు ప్రాజెక్టు ప్రధాన కాల్వతో పాటు పలు కాల్వల మరమ్మతులు చేపట్టడం వల్ల ఈ ఏడాది చివరి ఆయకట్టుకు సాగునీరు అందే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈలు రామచందర్, రాజేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బడితల రాజయ్య, పార్టీ మత్స్యశాఖ రాష్ట్ర కార్యదర్శి జంగిడి శ్రీనివాస్, జనగామ బాపు, గడ్డం పోచయ్య పాల్గొన్నారు.

## హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

**● జీఈసీవో రమాదేవి**

ములుగు రూరల్ ఆగస్టు 1: హాస్టల్ పరిసరాలను సరిశుభ్రంగా ఉంచాలని జెండర్ ఈక్వాలిటీ కోఆర్డినేటర్ రమాదేవి అన్నారు. ఇన్‌చార్జి స్పెషల్ ఆఫీసర్ జీవన ప్రియతో కలిసి ములుగు మండలంలోని టీఎస్ఎంఎస్ గర్ల్ హాస్టల్‌తో పాటు కేజీబీవీ హాస్టల్‌ను ఆమె గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా రమాదేవి మాట్లాడుతూ హాస్టళ్లలో జరుగుతున్న మరమ్మతు పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. విద్యార్థు లకు నాణ్యమైన విద్యతోపాటు, పౌష్టికా హారాన్ని అందించాలన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. పరిశుభ్రత పాటించాలని, తద్వారా ఆరోగ్యంగా ఉంటారని అన్నారు.

# పన్ను బకాయిలపై దృష్టిసారించాలి

**మునిసిపల్ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు**

కాకతీయఖని, ఆగస్టు 1: మునిసిపల్ ఉద్యోగులు వంద శాతం పన్నులను వసూలు చేయాలని, మొండి బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. మునిసిపల్ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మునిసిపల్ పరిధిలోని కమర్షియల్ ట్యాక్స్, ఆస్తి పన్నులను ప్రతిరోజూ వసూలు చేయాలని సూచించారు. మనిసిపాలిటీ ఆదాయంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కాలనీల్లో మురుగు నీరు నిల్వలేకుండా చూడాలన్నారు. బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి, అందులో నివసిస్తున్న వారిని ఖాళీ చేయించాలన్నారు. వార్డుల్లో విద్యుత్ స్తంభాలు, తీగలు దెబ్బతిని ఉంటే సత్వరమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందని, ఇంటింటికీ తిరిగి గుర్తించి ఏఎన్ఎం ఆశావర్కర్ల ద్వారా వైద్యం అందేలా చూడాలని అన్నారు. సిబ్బంది ఎవరైనా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వేతనాలు నిలిపివేయడమే కాకుండా వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మునిసిపల్ కమిషనర్ రాజేశ్వర్, టీపీవో సునీల్, టెక్నికల్ అధికారి మానస, ఆర్ఐ భాస్కర్ పాల్గొన్నారు.

## ఇండస్ట్రియల్ పార్క్ శంకుస్థాపన ఏర్పాట్ల పరిశీలన

గణపురం, ఆగస్టు 1: మండలంలోని మైలారం గ్రామంలో ఏర్పాటు చేసే ఇండస్ట్రియల్ పార్క్ శంకుస్థాపన ఏర్పాట్లను కలెక్టర్ రాహుల్ శర్మ గురువారం పరిశీలించారు. ఈనెల 3న రాష్ట్ర మంత్రులు పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లు పూర్తి చేయా లని అధికారులను ఆదేశించారు. సభా ప్రాంగణంలో విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్అండ్‌బీ ఈఈ వెంకటేశ్వర్లు, ఆర్డీవో మంగీలాల్, ఎంపీడీవో భాస్కర్ ఉన్నారు.

## రానున్నవి మంచి రోజులే..

(5వ పేజీ తరువాయి)

షార్ట్ ఫైరర్స్ కొరత ఉందని, త్వరలోనే ఇంటర్వ్యూ నిర్వహించి నియామకం చేపడతామని అన్నారు. ఏరియాలో కార్మికుల గైర్హాజర్లు ఉంటున్నాయని, ప్రస్తుతం 254 మంది డిస్మిస్‌కు దగ్గరలో ఉన్నారని తెలిపారు. ఇందులో 0-25 మస్టర్లు ఉన్నవారు 75 మంది కార్మికులు, 26-50 మస్టర్ల లోపు వారు 45 మంది, 76-100 మస్టర్లు ఉన్నవారు 66 మంది ఉన్నారని వివరించారు. వారు తమ ప్రవర్తన మార్చుకుని డ్యూటీలు సక్రమంగా చేసుకోవాలని కోరారు. గడిచిన మూడేళ్లలో సున్నా మస్టర్లు ఉన్నవారు 66 మంది ఉన్నారని, కొంత కాలం చూసి వారిని డిస్మిస్ చేసే అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారులు జ్యోతి, వెంకట్రామిరెడ్డి, తుకారాం, మౌనిక, శ్యామ్‌ప్రసాద్, పర్స శ్రీనివాస్, ప్రవీణ్ పాల్గొన్నారు.

## గోదావరి తీరాన భక్తుల రద్దీ

మహదేవపూర్, ఆగస్టు 1 : మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వర త్రివేణి సంగమ గోదావరి వద్ద గురువారం సందడి నెలకొంది. వివిధ ప్రాంతా నుంచి తరలివచ్చిన భక్తులు పుణ్యస్నానాలు చేశారు. ఉదయం నుంచే గోదావరి మాతకు పలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వరస్వామి దేవాలయానికి వెళ్లి స్వామి వారికి పూజలు చేశారు. తెలంగాణలోని దూర ప్రాంతాల నుంచే కాకుండా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు.

## కోచ్.. తూచ్!

(5వ పేజీ తరువాయి)

ప్రైవేట్ భాగస్వామ్యంతో కాజీపేటలో వ్యాగన్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు రూ.15కోట్లు మంజూరు చేశారు. దీనికి అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 54ఎకరాల భూమిని కూడా కేటాయించినా.. ఆ భూమిపై వివాదాలు రావటంతో ఆ ప్రాజెక్టు వెనక్కు వెళ్లింది. అయితే తెలంగాణ ఏర్పడిన తరువాత విభజన చట్టంలో కాజీపేట కోచ్ ఫ్యాక్టరీపై కేంద్రం హామీ ఇచ్చినా అది నెరవేరలేదు.

### వ్యాగన్‌తో ఒనగూరేది అంతంతే..

కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ కోసం జరుగుతున్న ఆందోళనల నేపథ్యంలో ఏర్పాటు చేసిన వ్యాగన్ పరిశ్రమతో ఒనగూరేది ఏమిటనే ప్రశ్నలు స్థానికుల నుంచి వ్యక్తం అవుతున్నాయి. తాము డిమాండ్ చేస్తున్న కోచ్ ఫ్యాక్టరీకి కొర్రీలు పెట్టి.. కేంద్ర ప్రభుత్వం వ్యాగన్ పరిశ్రమ ఏర్పాటు చేసి చేతులు దులుపుకొంటున్నారని విమర్శిస్తున్నారు. కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే సుమారు 60వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుందని, వ్యాగన్ ద్వారా కేవలం 2వేల మందికి కూడా ఉపాధి లభించే అవకాశాలు లేవని స్థానికులు పేర్కొంటున్నారు. వ్యాగన్ పరిశ్రమ ఏర్పాటు చేసినా కోచ్‌ఫ్యాక్టరీ కూడా కాజీపేటలో ఏర్పాటు చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది. ఇటీవల కేంద్ర మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి జరిపిన చర్చల్లో తెలంగాణకు ఇచ్చిన విభజన హామీల్లోని కాజీపేట కోచ్ ఫ్యాక్టరీని మంజూరు చేయాలని కోరారు. అయితే ఇటీవల ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్‌లో కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ప్రస్తావన లేదు. కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ వస్తే మరి కొన్ని రైల్వే సంబంధిత భారీ పరిశ్రమలు కూడా వచ్చే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

### కలగానే రైల్వే డివిజన్

దక్షిణ భారతదేశ రైల్వేకు గేట్‌వేగా ఉన్న కాజీపేటను డివిజన్‌గా ఏర్పాటు చేయాలనే డిమాండ్ తెరపైకి బలంగా వచ్చింది. కాజీపేట మీదుగా సెంట్రల్ ఇండియా, నార్త్ ఇండియాకు రైళ్లు నడుస్తున్నాయి. కాజీపేట, వరంగల్ రైల్వే స్టేషన్ మీదుగా నిత్యం సుమారు 200లకు పైగా గూడ్స్ ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయి. వీటితో పాటు భూపాలపల్లి, రామగుండం, గోదావరిఖని, మణుగూరు, కొత్తగూడెం తదితర ప్రాంతాల్లో ఉన్న బొగ్గు రవాణా కాజీపేట రైల్వే స్టేషన్ మీదుగానే జరుగుతుంది. ఎక్కువ అదాయం వచ్చే జంక్షన్లలో కాజీపేట ప్రథమ స్థానంలో నిలుస్తుంది. ఇక కాజీపేటకు అతి సమీ పంలో సికింద్రాబాద్ డివిజన్ ఉండటం మూలంగానే కాజీపేటకు డివిజన్ ఇవ్వటం కుదరటం లేదని కేంద్ర చెప్పుతుందని, అయితే విజయవాడకు కేవలం 30కిలో మీటర్ల దూరంలోనే ఉన్న గుంటూరును డివిజన్ చేసినప్పుడు హైదరాబాద్-సికింద్రాబాద్‌కు 128కిలో మీటర్లకు పైగా ఉన్న కాజీపేటను డివిజన్ చేయటంలో అభ్యంతరం ఎందుకనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. రైల్వే డివిజన్ ఏర్పడితే పరిపాల సౌలభ్యంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభించే అవకాశాలు ఉన్నాయని రైల్వే ఉద్యోగులు అభిప్రాయ పడుతున్నారు.

# వయనాడ్ వరద బాధితులకు సాయం

**మంత్రి సీతక్కకు రూ.2.50 లక్షల చెక్కులు అందజేసిన కాంగ్రెస్ నేతలు**

ములుగు, ఆగస్టు 1: వరదలతో అతలాకుతలమైన కేరళ రాష్ట్రంలోని వయనాడ్ బాధిత కుటుంబాలకు సాయం అందించేందుకు కాంగ్రెస్ జిల్లా నాయకులు ముందుకు వచ్చారు. మంత్రి సీతక్కను గురువారం హైదరాబాద్‌లో కలిసిన డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ రూ. 2లక్షలు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బానోతు రవిచందర్ రూ.50 వేల చెక్కులు అందజేశారు. వీరిని మంత్రి సీతక్క అభినందించారు.



మంత్రి సీతక్కకు చెక్కును అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

## ప్రైవేట్ క్లినిక్‌లను తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో

గోవిందరావుపేట, ఆగస్టు 1: మండలంలోని పస్రా గ్రామంలో ప్రైవేట్ క్లినిక్‌లను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అల్లెం అప్పయ్య గురువారం తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లినికల్ యాక్ట్ ప్రకారం ఏ ఆర్ఎంపీ రోగులకు మందులు రాయకూడదని, క్లినిక్ కూడా నడుపకూడదని అన్నారు. అదేవిధంగా ల్యాబ్‌లను పరిశీలించారు. పరీక్షల ఫీజుల వివరాలు రోగులకు తెలిసేవిధంగా గోడపై ప్రదర్శించాలని సూచించారు.

## ఎంపీవోగా వీరస్వామి బాధ్యతల స్వీకరణ

కాటారం, ఆగస్టు 1: మండల పంచాయతీ అధికారి(ఎంపీవో)గా పిల్లి వీరస్వామి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా కాటారం ఎంపీవోగా పనిచేస్తున్న ఉపేంద్రయ్య ఖమ్మం జిల్లాకు బదిలీ చేయగా మొగుళ్లపల్లి ఎంపీవోగా పనిచేస్తున్న వీరస్వామి కాటారానికి వచ్చారు. ఎంపీవోను పలువురు గ్రామపంచాయతీ కార్యదర్శులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా స్వాగతం పలికారు.

## అకడమిక్ క్యాలెండర్‌ను అనుసరించాలి : డీఈవో పాణిని

ములుగు కలెక్టరేట్, ఆగస్టు 1: జిల్లాలో అకడమిక్ క్యాలెండర్‌ను అనుసరించి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాఠశాలలు నిర్వహించాలని డీఈవో పాణిని అన్నారు. ములుగులోని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో డీసీఈబీ కార్యదర్శి సూర్యనారాయణ ఆధ్వర్యంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024-2025 విద్యాసంవత్సరానికి సంబంధించి అకడమిక్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఈవో కార్యాలయ కోఆర్డినేటర్లు మల్లారెడ్డి, సాంబయ్య, రమాదేవి, శ్రీనివాసరెడ్డి, ఎంఈవో సామల శ్రీనివాసులు, డీసీఈబీ సహాయ కార్యదర్శి విక్రమ్‌రాజ్, బోర్డు సభ్యుడు వినోద్‌కుమార్, కార్యాలయ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలి : ములుగు డీఎస్పీ

వెంకటాపూర్(రామప్ప), ఆగస్టు 1: గ్రామీణ ప్రాంతంలోని యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ములుగు డీఎస్పీ రవీందర్ అన్నారు. మండలంలోని పాలంపేట ప్రభుత్వ పాఠశాల ఆవరణలో గురువారం మండలస్థాయి వాలీబాల్ క్రీడలను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ యువత సన్మార్గంలో నడుచుకోవాలని, గుట్కా, గుడుంబా, గంజాయి వంటి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని అన్నారు. గ్రామాల్లో ఎవరైనా గుట్కా, గుడుంబా, గంజాయి వంటివి సేవిస్తున్నట్లు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం యువతకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ములుగు సీఐ శంకర్, స్థానిక ఎస్సై జక్కుల సతీష్‌తోపాటు పోలీస్ సిబ్బంది, పీఈటీలు పాల్గొన్నారు.

## ఆదివాసీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి

వెంకటాపురం(నూగూరు), ఆగస్టు 1: ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని ఆదివాసీ సంఘాల ఐక్యవేదిక నేతలు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ లక్ష్మీరాజయ్యకు ఈ మేరకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఏజెన్సీలో 1/70చట్టాన్ని అమలు చేయాలని, ఆదివాసీల సాగులో ఉన్న పోడుభూములకు పట్టాలు అందించాలని కోరారు. అనంతరం తహసీల్దార్‌ను శాలువాతో సన్మానించారు. ఈకార్యక్రమంలో ఆదివాసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు పూనెం రాంచందర్, పర్షిక సతీష్, తాటి లక్ష్మణ్, తుర్స చంటి, కుంజ మహేష్, కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

## దళితబంధు నిధులు మంజూరు చేయాలి

మల్హర్, ఆగష్టు 1 : రెండో విడత దళితబంధు నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని దళితబంధు సాధన సమితి జిల్లా అధ్యక్షుడు నౌళ్ల సంపత్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దళితబంధు సాధన కమిటీ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి పిలుపునివ్వగా ప్రభుత్వం ముందస్తు అరెస్టులకు పాల్పడం సరికాదని విమర్శించారు. తనతో పాటు మరో నాయకుడు రమేష్‌ను ఉదయమే పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

## బాధిత కుటుంబాలకు పుట్ట మధు పరామర్శ

కాటారం, ఆగస్టు 1: మండలంలోని బొప్పారం, కాటారంలో పలు బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, పెద్దపల్లి జడ్పీ మాజీ చైర్మన్ పుట్ట మధు గురువారం పరామర్శించారు. బొప్పారంలో మృతి చెందిన కొరళ్ల మల్లయ్య, పొట్ట మల్లక్క కుటుంబాలను, కాటారంలో మృతి చెందిన గడ్డం లచ్చయ్య కుటుంబ సభ్యులను కలిశారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల ఇంచార్జి జోడు శ్రీనివాస్, యూత్ మండల అధ్యక్షుడు రామిళ్ల కిరణ్, నాయకులు ఊర వెంకటేశ్వర్‌రావు, రాజేందర్, సతీష్ తదితరులు ఉన్నారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న పుట్ట మధు

## ఘనంగా ప్రపంచ స్కౌట్ స్కార్ఫ్ దినోత్సవం

కాకతీయఖని, ఆగస్టు 1: ప్రపంచ స్కౌట్ స్కార్ఫ్ దినోత్సవాన్ని భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ భూపాలపల్లి జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ రాహుల్ శర్మ, డీఈవో రాజేందర్, కస్తూర్బా జీసీడీవో శైలజ, కేజీబీవీ ప్రిన్సిపల్ జయవసంత లక్ష్మిని సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ స్కౌట్ స్కార్ఫ్‌తో సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూబీ(ఆర్) రోవర్ లీడర్ సుంకరి శ్రీనివాస్, గైడ్ క్యాప్టన్ శ్రీలత పాల్గొన్నారు.

## సాంస్కృతిక సారథి కళాకారుల హర్షం

కాటారం, ఆగస్టు 1: తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర ఐటీ, సాంస్కృతిక శాఖ మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఫ్లెక్సీకి మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద గురువారం క్షీరాభిషేకం చేశారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులకు గత ప్రభుత్వ 2020లో పెంచిన 30శాతం పీఆర్సీని అమలు చేస్తూ జీతాలు పెంచుతూ ప్రస్తుత సర్కారు తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సారథి కళాకారులు కుమార్, మహేందర్, శంకర్, సురేందర్, ప్రవీణ్, మధుబాబు, శిరీష, సుమలత, రాధిక, నాగమణి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆటో డ్రైవర్ల దినోత్సవ వేడుకలు

వెంకటాపూర్(రామప్ప), ఆగస్టు 1: ప్రపంచ ఆటో డ్రైవర్లు దినోత్సవ వేడుకలను జేఏసీ తెలంగాణ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి పంపిణీ చేశారు. యూనియన్ అధ్యక్షుడు గాజుల శ్రీను, ఉపాధ్యక్షుడు ఆర్.రమేష్; నాయకులు రెడ్డి తిరుపతి, రాజు, మహేష్, పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి పోలీసుల చేయూత

గోవిందరావుపేట, ఆగస్టు 1: మండలంలోని మొద్దులగూడెం గ్రామంలోని పిట్టల నర్సయ్య ఇల్లు ఇటీవల అగ్నిప్రమాదంలో పూర్తిగా దగ్ధమైంది. దీంతో నిరాశ్రయుడైన నర్సయ్య కుటుంబానికి పస్రా పోలీసులు చేయూతనందించారు. గురువారం సీఐ రవీందర్, ఎస్సై కమలాకర్ బాధిత కుటుంబానికి నగదుతోపాటు నిత్యావసర సరుకులు అందజేశారు.